క్లుప్తంగా

ఎత్తిపోతలను పూర్తి చేయాలి

నారాయణపేట రూరల్ : మంత్రి కేటీఆర్ ఈ నెల 24న జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో జీఓ నంబర్ 69 అమలుపై ప్రకటన చేయాలని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీఓను పక్కన పెట్టి వ్యయ ప్రయాసలతో కూడిన పాలమూర్-రంగారెడ్డి పథకం తెరమీదకు తీసుకుని రావడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ల కోసం కాకుండా రైతుల కోరకు ప్రభుత్వం పనిచేయాలన్నారు. పక్కనే పారుతున్న కృష్ణమ్మ నుంచి ఇవ్వాల్సిన మిగులు జలాలను వదిలి, శ్రీశైలం నుంచి వరద జలాలతో సాగు, తాగునీరు అందిస్తామనడం హాస్యాస్పదమన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్‌తో జీఓ 69 అమలు ప్రకటన చేయించి 'పేట' – కొడంగల్ ఎత్తిపోతలను పూర్తి చేయాలని కోరారు.

నేడు వాలీబాల్ జట్టు ఎంపిక

నారాయణపేట రూరల్ : జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మినీ స్టేడియం గ్రౌండ్‌లో సీనియర్ వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్ జరుగుతాయని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్ రెడ్డి, అమరేష్ తెలిపారు. చక్కగా ఆడి ప్రతిభ చూపిన క్రీడాకారులతో జట్టును ఎంపిక చేసి ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మక్తల్: వల్లభాపురం దేవాలయం దగ్గర సీసీ రోడ్డు పనులను మక్తల్ ఎంపీపీ వనజ బుధవారం ప్రారంభించారు. దత్తక్షేత్రం దగ్గర అభివృద్ధి చేసేందుకు రోడ్డు పనులను నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు వివరించారు. పస్పుల సర్పంచ్ దత్తు, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, సర్వేశ్వరనందస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐకి సన్మానం



ధన్వాడ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మరికల్ సీఐ శ్రీకాంత్‌రెడ్డిని బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. అధ్యక్షులు నరహరి మాట్లాడుతూ కాంగ్రెస్ తరపున పోలీస్ శాఖకు సంపూర్ణ మద్దతు ఇస్తామని అన్నారు. జట్రం లక్ష్మయ్య, జుట్ల ఆనంద్, నరేందర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నారాయణరెడ్డి, రాములు, బాలరెడ్డి, నర్సిములు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

చిన్నచింతకుంట: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్ధిపూరంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని గ్రామంలోని యువకులకు గ్రామ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం ఆటపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సుప్రియ, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటరాము, రైతు సమన్వయ కమిటీ జిల్లా మెంబర్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'దాడులను అరికట్టాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో ఎక్కడా చూసినా హిందువులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో జిల్లాలో ఒక బజరంగ్‌దళ్ కార్యకర్తపై విచక్షణ రహితంగా కత్తులతో పొడిచి చంపడం దారుణమని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. లవ్‌జిహాదీ పేరుతో హిందు అమ్మాయిలను చంపుతున్నారని, కేరళలో అనేకమంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను చంపుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కమిటీ సూచనమేరకు జిల్లా అదనపు కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదక్షులు బుచ్చారెడ్డి, పట్లోళ్ల లక్ష్మారెడ్డి, నగర అధ్యక్షుడు హన్మంతు, నగర బజరంగ్‌దళ్ ప్రముఖ్ సంపత్, పాల్గొన్నారు.

సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో యువజన విభాగం కీలకపాత్ర పోషించాలని కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అఖ్తర్ అన్నారు. పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన మహ్మద్ సల్మాన్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఇదేం 'చెత్త' పని



ఎర్రగుట్ట వద్ద పరిస్థితి ఇలా..

- శివారులో దర్శనమిస్తున్న వ్యర్థాల కుప్పలు
- డంపింగ్ యార్డు ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- ఇష్టానుసారం చెత్త వేస్తూ, నిప్పుపెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



యాద్గీర్ రోడ్డులో..



రోడ్డు పక్కన దర్శనమిస్తున్న వ్యర్థాలు

నారాయణపేట టౌన్ : పట్టణ శివారులో ఇష్టానుసారం చెత్త, వ్యర్థాలను వేస్తూ నిప్పుపెడుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, గాలికాలుష్యంతో అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా కొందరు సిబ్బంది మురుగు కాల్వలలో మట్టి, చెత్తచెదారం తొలగించి యాద్గీర్ రోడ్, బైరంకొండరోడ్, లోయకపల్లి గ్రామ శివార్లలో వేస్తున్నారు. చెత్తతో పాటు, చనిపోయిన జంతువుల కళేబరాలను అక్కడే పడేస్తున్నారని అటుగా వెళ్లే వాహనదారులు, పాదాచారులు దుర్వాసన భరించలేకున్నామని వాపోతున్నారు. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. అంతేకాకుండా పొర వేస్తున్న చెత్తకు నిప్పుపెట్టడంతో పొగవ్యాపించి ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకు నిప్పు పెట్టడం వల్ల వాటి పక్కనే నాటిన హరితహారం మొక్కలు కాలి బూడిదవుతున్నాయని, పట్టించుకునే వారే కరువయ్యారని చెబుతున్నారు. పట్టణానికి సమీపంలోని పగిడిమర్రి రోడ్‌లో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్తవ్యర్థాలు వేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడమే లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జీర్ణహళ్లిని సందర్శించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఊట్కూరు: మండల పరిధిలోని జీర్ణహళ్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు బుధవారం వివిధ శాఖల అధికారులు సందర్శించారు. గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'సమస్యలతో సతమతం' అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించిన కలెక్టర్ వివిధ శాఖల అధికారులను జీర్ణహళ్లి గ్రామాన్ని సందర్శించాలని ఆదేశించారు. దీంతో గ్రామంలో మురుగు కాలువలు, హరితహారం మొక్కలు, పాఠశాల భవనం, గ్రామానికి వెళ్లే రోడ్డు, మంచి నీటి ట్యాంక్ తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్, పీఆర్, గ్రామ కార్యదర్శి తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాలప్ప మాట్లాడుతూ విద్యార్థులు తక్కువగా ఉండడం కారణంగా పాఠశాల భవనం నిరుపయోగంగా ఉందని , భవనం చుట్టూ ముళ్లపొదలు తొలగించి శుభ్రపరుస్తామని తెలిపారు. గ్రామం నుంచి పెద్ద పొర్ల వరకు అలాగే మొగ్దంపూర్ వరకు ఈజీఎస్ ద్వారా త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తామని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్‌ను నియమించి మురుగు కాలువలు శుభ్రపరుస్తామని, వీధుల్లో మెర్క్యూరీ బల్బులు ఏర్పాటు చేస్తామని అన్నారు. మినీ ట్యాంక్ చుట్టూ పొదలు తొలగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎల్లయ్య, పీఆర్ ఏఈ జగత్చంద్ర, ఈసీ శ్రీనివాసులు, టీఏ గోపాల్, కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి



ఊట్కూరులో మాట్లాడుతున్న డీపీఓ మురళి



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం మండలంలో ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 28జీపీల్లో నిర్దేశించిన సమయసారిణి ప్రకారం వైద్య బృందం వచ్చి పరీక్షలు చేస్తారని, మొదటి రోజు కోటకొండ, అమ్మిరెడ్డిపల్లిలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

ఊట్కూరు: కంటి వెలుగు కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు డాక్టర్ శ్రీలత, భవానీలు తెలిపారు. బుధవారం ఊట్కూరులోని గ్రామపంచాయతీ భవనంలో సిబ్బంది, వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీపీఓ మురళీ హాజరయ్యారు. ఊట్కూరు, పులిమామిడి గ్రామాలకు మొదటి రోజు కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. వైద్య సిబ్బంది మణిమాల, డాక్టర్ సాయి, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

మద్దూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో మొదటగా మద్దూరులోని సీహెచ్‌సీ సెంటర్‌లో, జాధరావ్‌పల్లి పంచాయతీ కార్యాలయం, కొత్తపల్లిలో పంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మాగనూర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. బుధవారం మాగనూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో ఆయా శాఖల అధికారులతో గురువారం ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రాజు, ఎంపీఓ జైపాల్ రెడ్డి, డాక్టర్ భానుప్రకాష్, మండల వైద్యాధికారి రాఘవేంద్రరెడ్డి, సూపర్‌వైజర్‌లు యాదమ్మ, మలేశ్వరమ్మ, ఏఎన్‌ఎం సుధా, డాటా ఎంట్రీఆపరేటర్ రవి, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ఊట్కూరు: మండలంలోని పగిడిమర్రి గ్రామ శివారులో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదరంగా మారాయి. రోడ్డు పక్కన వ్యవసాయ పొలంలో చేతి పంపు పక్కనే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు ఏర్పాటుచేశారని ఇక్కడ విద్యుత్ వైర్లు కిందకు ఉండడంతో పశువులు, ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాటసారులు, రైతులు కోరుతున్నారు.

సగరుల అభివృద్ధికి కృషి చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సగరులు(ఉప్పర) అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ అన్నారు. బుధవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం తరపున సగరుల సంక్షేమం, అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సగరలో ఉన్న జిల్లాలోని పేద విద్యార్థులకు మెరిట్‌స్కాలర్‌షిప్‌లు వంటి చర్యలపై సంఘం పెద్దలతో సమాలోచనలు చేసి కార్యచరణ ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సగర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కర్యాదర్శి నారాయణసాగర్, రవీందర్, బుడ్డన్నసాగర్, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌సాగర్, సత్యన్నసాగర్, చిన్నకిష్టన్న, నవీన్‌సాగర్, శివాసాగర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్ : జిల్లాలో పలు గురుకులాలు, కేజీబీవీలు, వివిధ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, త్వరలో ప్రకటించనున్న గురుకుల పోస్టుల భర్తీ ప్రక్రియలో వేయిటేజ్ ఇవ్వాలని కోరారు. ఏడాదిలో మొత్తం 12 నెలల జీతాలతో పాటు ప్రతినెల మొదటి తేదీనే వేతనాలు అందించాలన్నారు. హెల్త్ కార్డులు, ప్రసూతి సెలవులను ఇవ్వాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మద్దూరు: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. అలాగే మద్దూరు, కొత్తపల్లి రెండు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హాజరుకావాలని అందులో పేర్కొన్నారు.

బాలకేంద్రం అభివృద్ధికి సహకరించాలి

నారాయణపేట రూరల్ : కళలకు జీవం పోస్తున్న బాలకేంద్రాన్ని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నజట్రంకు చెందిన ఓ కళాకారుడు రూ.26వేల విలువ కల్గిన నూతన కీ బోర్డును బాలకేంద్రానికి బుధవారం బహూకరించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎంతోమంది చిన్నారులకు గాత్రం, తబల, వీణా, పాటలు, నృత్యం, చిత్రలేఖనం తదిరాలలో తర్ఫీదును ఇస్తు, భవిష్యత్ తరాలకు సంస్కృతి, సాంప్రదాయాలను అందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నర్సింహులు, వసంత్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

'దాడులు చేయడం సరికాదు'

నారాయణపేట టౌన్ : రైతు భీమా పథకంలో జరుగుతున్న అవినీతిని బయటకు పెట్టిన విలేకరులపై దాడులు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమాలను, వాస్తవాలను పత్రికలో రాసిన ధన్వాడ మండలానికి చెందిన ఇమామ్ అనే విలేకరిపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని, దళిత బంధులో అవినీతిపై చట్టపరంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

మక్తల్: భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ఆర్‌యూపీపీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ విభీషణ్ అన్నారు. బుధవారం మక్తల్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 సంవత్సరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో పాటు పాటు లక్షలాది మంది సాక్షిగా భాషా పండితులను అప్‌గ్రేడ్ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని అన్నారు. ఇప్పటివరకు అమలు చేయడం లేదని అన్నారు.అందరితో పాటు తమకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నర్వ: ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని ఏపీఓ మొగిలప్ప తెలిపారు. అనుసంధానం చేసుకోకపోతే జాబ్‌కార్డు తొలగించే అవకాశం ఉందన్నారు. అనుసంధానం కోసం ఆధార్‌కార్డు జిరాక్స్‌ను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లేదా పంచాయతీ కార్యదర్శికి గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వాలని ఇదే చివరిరోజని గమనించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవకాశాన్ని జాబ్‌కార్డులున్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలను అభినందిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

మరికల్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. మరికల్ యువక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఫైనల్ పోటీలో బుధవారం విజయం సాధించిన టీం ను ఆయన అభినందించారు. గెలుపు ఓటములను సహజంగా తీసుకొని ఆడాలని సూచించారు. క్రికెట్‌తో పాటు ఇతర పోటీల్లో గెలుపొందిన విజేతలకు రెండు రోజుల్లో బహుమతులు అందజేస్తామని యువక మండలి అధ్యక్షులు రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, హరీష్, రాములు, రామన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

నారాయణపేట రూరల్ : రైతులు దీర్ఘకాలికంగా రుణాలను చెల్లించలేక బకాయి పడ్డవాటిని పూర్తి చేసుకునేందుకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులోకి వచ్చిందని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ నియాజ్ తెలిపారు. రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు బ్యాంకు అందించిన అన్ని రకాల రుణాలను సకాలంలో చెల్లించి సహకరించాలన్నారు. ఎల్‌టీ లోన్ తీసుకున్న రైతులు పథకం ద్వారా వడ్డీ రాయితీ పొందవచ్చన్నారు. గ్రామస్థాయిలో రైతులకు హౌసింగ్, ఎడ్యుకేషన్ లోన్లు అందిస్తామన్నారు. నారాయణపేట సంఘం ద్వారా క్రాప్‌లో లోన్ తీసుకోవాలన్నారు. తక్కువ వడ్డీతోనే రుణాలు పొందవచ్చన్నారు. పీఎం జీవనజ్యోతి, పీఎం సురక్ష భీమా యోజనను సైతం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నారాయణపేట టౌన్ : పట్టణంలోని ప్రధాన డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ కార్మికులు బుధవారం తొలగించారు. పనులను కమిషనర్ సునీత పరిశీలించారు. ప్రధాన డ్రైయినేజీలో చెత్తచెదారం, వ్యర్థాలు వేయకుండా వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. అదే విధంగా సత్యసాయి కాలనీలో రోడ్డుకు ఇరువైపులా హారితహారం మొక్కలను నాటించారు. మొక్కలకు నీరు అందించి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



మక్తల్‌లో విద్యార్థులకు స్టడీమెటీరియల్స్ అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి ఆకాంక్షించారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. రూ.20 లక్షల ఖర్చుతో 3,500 తెలుగు మీడియం, 15,00 ఇంగ్లీష్ మీడియం మెటీరియల్స్‌ను మక్తల్ నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు అందజేశామన్నారు. స్టడీ మెటీరియల్ కోసం 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామాలకు మంచి పేరు తీసుకునిరావాలని కోరారు. విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న వర్కటంను ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు. జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, వెంకటవరలక్ష్మి, దత్తురావు, పరంజ్యోతి, సుధీర్, జయశ్రీ, ఉషారాణి, రాజేశ్వరి, మల్లికార్జున్, స్వప్న, కమలబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఘనంగా లక్ష పుష్పార్చన



దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని వేదికపై కొలువు తీరిన చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లక్ష పుష్పార్చన ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పలువురు మహిళలు ఉత్సవ మూర్తులపై పుష్పాలను వేశారు. ఈ కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు కొనసాగింది.

మలేరియా కేసులు తగ్గుముఖం

ఆత్మకూర్: వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని రాష్ట్ర మలేరియా సహాయ అధికారి, కంటివెలుగు జిల్లా మానిటరింగ్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తిప్పడంపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి డెంగీ, మలేరియా, సీజనల్ జ్వరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో 12 డెంగీ కేసులు నమోదు కాగా.. మలేరియా కేసులు నమోదు కాలేదని వైద్యులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, సూచించారు. ఆయన వెంట వైద్యులు రంజిత్‌కుమార్‌రెడ్డి, రాయచూర్ ప్రత్యూష, సబ్ యూనిట్ అధికారి రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్‌గౌడ్, సామ్రాజ్యలక్ష్మి, వైద్యసిబ్బంది ఉన్నారు.

పరామర్శ

దేవరకద్ర: మండలంలోని పెద్దరాజమూర్‌లో జర్నలిస్టు శ్రీనివాస్ తండ్రి పొద్దుటూరి వెంకటేశ్ శెట్టి మృతి చెందడంతో బుధవారం పలువురు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, కిషన్‌రావు, మాజీ ఎంపీపీ గోపాల్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వ కన్నయ్య, నాగయ్యగుప్తా, నాగులు, హరికాంత్, జర్నలిస్టు నాయకులు గ్రామానికి వెళ్లి వెంకటేశ్ శెట్టి పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.